www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 30 డిసెంబర్ 2023
5
అన్నమయ్య



ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.1600 కోట్లు ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పిడిఎస్‌యు జిల్లా నాయకులు శివతేజ డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణాద్రి ఇంజినీరింగ్ కళాశాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి కోర్సులు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ సకాలంలో విడుదల కావడం లేదని తెలిపారు. కొంతకాలంగా వేలాది మంది విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన సకాలంలో విడుదల కాకపోవడంతో ప్రయివేట్ కలాశాల యాజమాన్యాల నుండి విద్యార్థులు పరీక్షల వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్‌లో బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జిఒ నెంబర్ 77ను తీసుకువచ్చి వేలాది మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు దూరం చేస్తుందని, అటువంటి జీవో నెంబర్ 77 వెంటనే రద్దు చేయాలన్నారు. సామాన్య విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన చెందారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు రామ్ చరణ్, రాజశేఖర్, కార్తీక్, హేమంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు

రిలే నిరాహార దీక్షలు

- బి.కొత్తకోటలో ఆవుకు వినతిపత్రం సమర్పణ
- 18వ రోజూ కొనసాగిన సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బి.కొత్తకోటలో ఆవుకు వినతిపత్రం ఇచ్చిన నిరసన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.



బి.కొత్తకోట : ఆవుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్వాడీలకు ప్రభుత్వం తెలంగాణ కన్నా అదనంగా రూ.వేయి ఎక్కువ ఇస్తాం, మూడు నెలల తర్వాత వేతనాలు పెంచుతాం, సమ్మె చేయడం కరెక్ట్ కాదు సమ్మె విరమించండి అంటూ కేవలం మాటలతో సరిపెట్టి, శాసన సభ్యులకు మూడు సార్లు వేతనం పెంచుకొన్నారని కావున మాటలు అంగన్వాడీలకు, మూటలు మీ ప్రజాప్రతినిధులకా అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన ఆర్‌డిఒ ఆఫీసు ఎదుట ప్రాజెక్టులలోని అంగన్వాడీల సమ్మె 18వ రోజు నిరాహార దీక్షల సందర్భంగా శిబిరానికి హాజరై అంగన్వాడీల సమ్మె నుద్దేశించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి 18 రోజులుగా సమ్మె చేస్తుంటే చూసిచూడనట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ధరలు విపరీతంగా పెరిగాయని, అంగన్వాడీల కిచ్చే వేతనం, బిల్లులు సకాలంలో రాక అప్పులతో మానసిక వేదన పడుతున్నారన్నారు. ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 ఇవ్వకపోయినా మీరిచ్చిన మాట ప్రకారం తెలంగాణ అంగన్వాడీల కన్నా అదనంగా రూ.వెయ్యి ఎక్కువ ఇస్తానని ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టి పనిభారం పెంచి జీతాలు పెంచకపోవడం సిగ్గుమాలిన చర్యగా పేర్కొన్నారు. వీరబల్లి, కలకడ ప్రాంతాలలో వైసిపి నాయకులే సమ్మె విరమించమని రాజకీయ వేధింపులు ఆపకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాసనసభ్యుల సిపారసు లేకుండా అంగన్వాడీ ఫోస్టులు కానీ, హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వడంలేదని వీరికి వచ్చే ఎన్నికలలో బుద్ధి చెప్పాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన గుడ్లు, పాలు పౌష్టికాహారం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులంటూ జీతం తక్కువిచ్చి, సంక్షేమ పథకాలకు అనర్హులుగా ముద్రవేసి అంగన్వాడీలను ఆర్థిక సామాజిక దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. నాణ్యమైన సెల్ ఫోన్‌లు ఇవ్వలేదన్నారు. ప్రజలకు సేవ చేస్తూ తమ పిల్లలను సరైన చదువులువైద్య అవసరాలు భారమై జీతాలు పెంచమని గత ఐదేల్లుగా విన్నవించినా ఫలితం లేదని, అంగన్వాడీల పోరాటాలను చులకన చేసిమాట్లాడితే చంద్రబాబును మాజీ సిఎంగా 13 ఏళ్ల అధికారానికి దూరం చేసిన అంగన్వాడీల పోరాట చరిత్రను ప్రభుత్వానికి గుర్తు చేశారు. భవిష్యత్‌లో అంగన్వాడీల ఉద్యమాన్ని జీతాలు పెంచే వరకు లబ్ధిదారులతోనూ ప్రజాసంఘాలు రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి సమ్మెను తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.సిద్ధమ్మ, డి.భాగ్యలక్ష్మి, పి.బంగారుపాప, పి.ఖాజాబి, అరుణ, సుమలత, కవిత, సబీనా, మంజుల, భూదేవి, పద్మజ, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు మినీ వర్కర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు. **రైల్వేకోడూరు :** అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు శ్రీ రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధకుమారి, మండల కార్యదర్శి జి.పద్మ వెన్నెల శిరీష, ఎఐటియుసి నాయకులు సరోజ, నిర్మల, నాగమణి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారికి గౌరవ అధ్యక్షులు వనజ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్. చంద్రశేఖర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు జాన్ ప్రసాద్, సిపిఎం మండల కార్యదర్శి యానాదయ్య, సిఐటియు మండల కోశాధికారి హరి నారాయణ, సంఘీభావం తెలియజేశారు. **రాజంపేట అర్బన్ :** తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరేవరకూ పోరు ఆగదని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తేల్చి చెప్పారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు విజయ, అమరావతి, శివరంజని, హేమలత పాల్గొన్నారు. **ఆవుకు వినతిపత్రం సమర్పణ : బి.కొత్తకోట :** తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆవుకు వినతి పత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు. **మదనపల్లి :** అంగన్వాడీలు నిరసనను కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హరింద్రనాథ్ శర్మ, మధురవాణి, గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, శ్యామవేణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** అంగన్వాడీల దీక్షలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, అంగన్వాడీలు సుకుమారి, ఓబులమ్మ, లక్ష్మిదేవమ్మ, ప్రభావతి, రెడ్డెమ్మ, శ్రీవాణి, విజయ, చిట్టెమ్మ, ఇరగమ్మ, రుక్మిణమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లి : మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు



రైల్వేకోడూరు : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

- చెవిలో పువ్వులతో వినూత్న నిరసన
- సిఎం దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకెళ్తా : ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి
- టిడిపి నాయకుల సంఘీభావం
- 4వ రోజూ కొనసాగిన సమ్మె



రాజంపేట : అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు



రాజంపేట : కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చెన్నయ్య, సి.రాంబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం నాల్గవవ రోజు మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సందర్భంగా ఒక సంవత్సరం ఓపిక పట్టండి మన ప్రభుత్వం వచ్చిన 6 నెలల లోపే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన-వేతనం చెల్లిస్తామని చెప్పిన మాటను గాలికి వదిలిచెవిలో పూలు పెడుతున్నారని విమర్శించారు. కార్మిక శాఖ ప్రతిపాదనల మేరకు జిఒఆర్‌టి నెంబర్ 30 ప్రకారం పంపు ఆపరేటర్లు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వర్కర్స్, వర్క్ ఇన్స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, ఆఫీసు నిర్వహణ కార్మి కులకు వేతనాలు పెంచుతామని నాలుగేళ్లుగా హామీలతోనే సరిపెడు తున్నారని విమర్శించారు. 15 ఏళ్లుగా నైపుణ్యంతో కూడిన పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం దగా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలుకి నోచుకోవడం లేదన్నారు. ఈ సమ్మెతోనైనా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.కెవిపియస్ నాయకులు డిసి వెంకటయ్య సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు అగ్గి రాముడు, సిద్దయ్య, శిద్దముల్లు, రవికుమార్, వై.వెంకటరమణ, మంగమ్మ, రమణమ్మ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచడంతోపాటు ఇతర డిమాండ్లు కూడా నెరవేర్చాలని మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సందర్భంగా కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ కార్మికులు నాల్గొన్నారు. **సిఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్తా : ఎమ్మెల్యే మేడా** వెంకట మల్లిఖార్జునరెడ్డి మున్సిపల్ కార్మికుల దీక్షా శిబిరం వద్దకు చేరుకొని కార్మికులను పరామర్శించారు. కార్మికుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. **'బత్యాల' సంఘీభావం :** మున్సిపల్ కార్మికులను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు దీక్షా శిబిరం వద్ద కలిసి వారిని పరామర్శించారు. వారితోపాటు దీక్షలో కూర్చుని నిరసన తెలిపి తమ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ పట్టణాన్ని సుందరీ కరణ చేసి ప్రజలను ఆరోగ్యంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులదే కీలకపాత్రన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వారికి వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.ఓబయ్య, లక్ష్మిదేవి, రమణ, ప్రసాద్, టిడిపి అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, కౌన్సిలర్ తుపాకుల అశోక్ కుమార్, మిరియాల జ్యోతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాయచోటి : చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొ న్నారు. శుక్రవారం జగనన్న విద్యాదీవెన ద్వారా రాష్ట్రంలోని 8.09 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.584 కోట్లను నేరుగా తల్లుల ఖాతాల్లో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూలై 2023 నుంచి సెప్టెంబరు 2023 త్రైమాసాల 4వ విడత ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన బహిరంగ సభ నుంచి బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమచేశారు. కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష పిఎస్, సోషల్ వెల్ఫేర్ డిడి. జాకీర్ హుస్సేన్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సండప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జులై 2023 నుండి సెప్టెంబరు 2023 త్రైమాసాల 4వ విడత జగనన్న విద్యా దీవెన కింద 29.384 మంది విద్యార్థులకు సంబంధించి 27.264 మంది తల్లుల ఖాతాల్లో రు. 20.62 కోట్లు నేరుగా జమచేశామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని చెప్పారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదని, చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదన్న లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. అర్హులైన విద్యార్థులందరూ జగనన్న విద్యాదీ వెన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గిరీష



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జగన్మోహన్‌రాజు

నవరత్నాలు కాదు.. నవమోసాలు :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గొప్పగా చెప్పుకుంటూ డప్పు కొట్టుకొంటున్న నవరత్న సంక్షేమ పథకాలు అన్ని ఒట్టి బూటకమని, అవి రాష్ట్ర ప్రజానీకాన్ని నిలువునా మోసం చేసే నవ మోసాలని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా పాదయాత్రలో ఇచ్చిన హామీలపై నవరత్నాలు-నవ మోసాలు అన్న పేరుతో చమర్తి శుక్రవారం తన కార్యాలయంలో పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలులో కనీసం 15 శాతం కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పడం హాస్యాస్పదమని, ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్పి నిజం చేయాలని ఆరాటపడే వ్యక్తి జగన్ అని ఆరోపించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో వైఫల్యానికి ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను ఎమ్మెల్యేలపై నెట్టి వారిపై వ్యతిరేకత ఉందంటూ సాగు చూపి వేరే నియోజకవర్గాలలో పోటీ చేయాలనే కొత్త నినాదాన్ని తెర పైకి తెచ్చారని విమర్శించారు. రాజకీయంగా ఎన్ని కుట్రలు పన్నినప్పటికీ రాష్ట్ర ప్రజానీకం రానున్న ఎన్నికలలో వైసిపిని బంగాళాఖాతంలో కలపడం ఖాయమని వివరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : 'చింతల'

ప్రజాశక్తి-పీలేరు : ప్రజల సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణం లోని పలు వీధుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఎందరో అర్హులైన పేదలు, నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు లబ్ధి పొందా రన్నారు. ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పాలిస్తున్న జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలందరూ తోడ్పాటును అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్‌రెడ్డి, పీలేరు ఎంపిపి సతీష్ రెడ్డి, జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ షేక్ జీనత్ షఫీ, ఎంపిటిసి కంభం నరసింహారెడ్డి, వైసిపి యువ నాయకులు జివి రాకేష్ రెడ్డి, ఎస్‌విఎస్ఎస్ కళ్యాణ మండపం నిర్వాహకులు కృష్ణారెడ్డి, నాయకులు ఎమ్మెస్ జావిద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్ రెడ్డి, పంచాయతీ ఇఒ ప్రసాద్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ రవి కుమార్, విఆర్ఒ ఎర్రయ్య, రాష్ట్ర మైనారిటీ జనరల్ సెక్రెటరీ హుమాయున్ పాల్గొన్నారు.

'తప్పల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి'

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో వందశాతం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని కలెక్టర్ గిరీష పిఎస్, సంబంధిత అధికారులకు సూచించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫెన్స్ హాల్‌లో కలెక్టర్ ఓటర్ల జాబితా సవరణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడానికి అధికారులందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రత్యేక ఎలక్టరోల్‌పై బిఎల్‌ఒలు ప్రతి ఇంటికి వెళ్లి కచ్చితంగా పరిశీలన చేసి పటిష్టవంతంగా జాబితా రూపొందించాలన్నారు. వెరిఫికేషన్ కోసం వెళ్ళినపుడు పేర్లు, చిరునామాలు, ఫొటోలు, అడ్రస్ ఇలా అన్ని వివరాలు పరిశీలించాలని, డబుల్ ఫొటోలు, డుప్లికేట్ ఓట్లు ఉంటే సరిచేయాలని సూచించారు. ఒక ఇంటిలో ఎంతమంది ఓటర్లు ఉంటే వారందరి ఓట్లు ఏ పోలింగ్ స్టేషన్లో ఉన్నాయో సీరియల్ నెంబర్లు పరిశీలించాలన్నారు. సరైన కారణాలతో తొలగింపులు చేయాలని, అలాంటి తొలగింపులకు రికార్డు ఉండాలని సూచించారు. మరణాల కేసులు లేదా వలసలు మొదలైన వాటి తొలగింపులకు భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. ఫారమ్ - 6 ఫారమ్-7, ఫారమ్-8 ల పెండిన్సిలు, అన్ ప్రాసెస్డ్ అప్లికేషన్లను ఎప్పటికప్పుడూ పూర్తి చేసి అప్డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్‌డిఒలులు, రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

'మిట్స్'లో మిల్లెట్స్ మేళా

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక మిట్స్ కళాశాలలో మిల్లెట్స్ మేళాను నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల మిల్లెట్స్‌ను ప్రదర్శించి వాటి ఉపయోగాల గురుంచి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ శతాబ్దాలుగా మిల్లెట్లు మన ఆహారంలో అంతరాగేంగా ఉన్నాయి అని, అనేక ఆరోగ్య ప్రయోజనాలతో పాటు, మిల్లెట్లు తక్కువ నీరు ఇన్‌పుట్ అవసరాలతో పర్యావరణానికి కూడా మంచివని పేర్కొన్నారు. ఎంబిఎ విద్యార్థులు అవగాహన కల్పించడం, మిల్లెట్ల ఉత్పత్తి వినియోగాన్ని పెంచే ఆలోచనలు వివరించడం ఆనందంగా ఉందన్నారు. ఐక్యరాజ్య సమితి, భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు, 2023ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిందని తెలిపారు. ఆధునిక ఆహారం మనజీవితాల్లోకి చేరడంతో ప్రక ృతి ప్రసాదితాలను పక్కకు పెట్టామని, మనం తీసుకుంటున్న పాలియో డైట్ వంటి అనేక ఆధునిక ఆహారం ఆరోగ్యానికి హానికరమని, పోషకాహార నిపుణులుహెచ్చరిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. శుద్ధి చేసిన ధాన్యాలు అధికంగా తీసుకోవడంవలన ఊబకాయం వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. తృణధాన్యాలు మంచి ఆరోగ్యకరమైన శరీరానికి హాని కలిగించని ఫుడ్ అని, తృణధాన్యాలు తినడం మధుమేహం, గుండె జబ్బులు, అధిక రక్తపోటుతో అనేక వ్యాధులను నివారిస్తుందన్నారు. విద్యార్థులు మిల్లెట్స్ గొప్పదనం గురుంచి తెలుసుకొని అందరికి వివరించడం మంచి విషయని తెలిపారు. కార్యక్రమంలో కలశాల ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ గీతాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

10వ రోజుకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు అంబేద్కర్ విగ్రహానికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందిస్తూ తమ నిరసనను తెలియజేశారు. వీరితో పాటు కెజిబివిలో పని చేసే బోధన సిబ్బంది కూడా ఆందోళన బాట పట్టారు. సమ్మెకు వెళితే విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించినా బోధన సిబ్బంది లెక్క చేయలేదు. సమ్మె ఉధృతంగా మారింది. తమ డిమాండ్లను పరిష్కరించేదాకా ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నాడు-నేడు నుంచి పిల్లలకు చదువులకు అవసరమయ్యే అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం, యూ డైస్ తదితర వాటిని ఎప్పటి కప్పుడూ ప్రభుత్వం నిర్దేశించిన సమయాలలో విధులను పూర్తి చేస్తున్నామన్నారు. రూ.10 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్‌తో కూడిన గ్రాట్యూటీ కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ కార్డు సదుపాయాన్ని కల్పించాలన్నారు.

'ఏ సమస్యనైనా నా దృష్టికి తీసుకురండి'

ప్రజాశక్తి - రాయచోటి : ఎన్నికలకు సంబంధించి ఏ సమస్య అయినా చివరి నిమిషంలో కాకుండా ముందే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ గిరీష పిఎస్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ముసాయిదా ఓటర్ జాబితా, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలో ఎన్నికల సంఘంతో ఈ నెలలోనే సమీక్ష జరిగిందని, జిల్లాకు సంబంధించిన అన్ని విషయాలు చర్చించామని చెప్పారు. సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ స్టేషన్స్‌కు సంబంధించిన ఫిర్యాదులు ఏమైనా ఉంటే త్వరగా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. బోగస్ దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలోనూ తీసుకోబోమని అటువంటి దరఖాస్తులు ఇచ్చిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుం టామన్నారు. స్వీప్ కార్యక్రమాల గురించి మాట్లాడుతూ ప్రజలను ఎక్కువగా భాగస్వామ్యం చేసి ఆ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్య నారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో తగ్గిన నేరాలు : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్



మాట్లాడుతున్న కృష్ణారావు

జిల్లా పరిధిలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని ఎస్‌పి కృష్ణారావు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలో జరిగిన నేరాలు, కేసుల వివరాలు, పోలీస్ పనితీరు గురించి ఆయన మీడియాకు వెల్లడించారు. గత ఏడాదితో పోల్చుకుంటే 2023లో నేరాలు సంఖ్య తగ్గిందన్నారు. 2022లో 6079 కేసులు నమోదు కాగా, 2023లో 4920 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. గత ఏడాది హత్యలు సంబంధించిన కేసులు 35 నమోదు కాగా ఈ ఏడాది 44 నమోదైనట్లు తెలిపారు. ప్రజల జీవనానికి ఇబ్బందికరంగా మారిన 105 మంది పై రౌడీ షీట్స్ ఓపెన్ చేయగా, 4502 మందిని అధికారులు ఎదుట బైండ్ ఓవర్ చేసి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం వలన పాత నేరస్తులను గుర్తించడం ఫింగర్ ప్రింట్స్ తీయడం వలన చాలా వరకు చోరీ కేసులను తగ్గించడం జరిగిందన్నారు. ఫోక్సో చట్టం కింద గత ఏడాది 46 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 37 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది సైబర్ నేరాలు పెరిగినప్పటికీ రికవరీ స్థాయి కూడా అధికంగా పెరిగిందని వివరించారు. ఎర్రచందనం అక్రమ రవాణా సంబంధించిన తొమ్మిది కేసులలో 30 మందిని అరెస్టు చేసి రూ.75 లక్షల 13,500 విలువ చేసే 63 ఎర్రచందనం దుంగలను, 11 వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. మట్కా, జూదం, కోడిపందాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన 458 కేసులలో 2512 మందిపై కేసు నమోదు చేసి రూ.70 లక్షల 24 వేల 711లు జరిమానా విధించడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా వివిధ కేసులలో వేగవంతంగా దర్యాప్తు చేపట్టేందుకు కృషి చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆయన రివార్డులను అందజేసి అభినందించారు.



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ దైవాదీనం

పోలింగ్ బూత్‌ల తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 17 గ్రామాలలో 43 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని అదనంగా బాలికల ఉన్నత పాఠశాలలో మరొక పోలింగ్ బూత్‌ను చేర్చినట్టు తహశీల్దార్ దైవాదీనం పేర్కొన్నారు. శుక్రవారం బాలికల ఉన్నత పాఠశాలలో రెండో పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. విద్యుత్, మరుగుదొడ్లు వంటి వసతులు ఉన్నాయా లేవా అని వాటిని పరిశీలించినట్లు పేర్కొన్నారు. తహశీల్దార్ వెంట రీసర్వే డిటి రెడ్డిబాబు, బిఎల్‌ఒ వెంకటేశ్వర్లు, నరేంద్ర, బాలుర ఉన్నత ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వర్‌రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన అవసరం



ప్రజలకు ఇవిఎంలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు : స్థానిక పట్టణంలోని సెక్టార్-16 పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి సెక్టార్ అధికారి సుధాకర్, నోడల్ ఆఫీసర్ రత్నకిషోర్, బిఎల్‌ఒ రాజకుమార్ ఆధ్వర్యంలో ఇవిఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఓటర్లకు ఇవిఎంలపై ఉన్న అపోహలను తొలగించ డానికి పారదర్శకంగా ఓటింగ్ జరిగేందుకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

5 నుంచి రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-కలకడ

మండలంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. జనవరి 5 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.5న దిగువపాలెం, 9న కోటగుడిబండ, 19న కోన, 23న నడిమిచర్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2న కె.ఊట్లపల్లి, 9న దేవలపల్లి, 16న ఎర్రయ్యగారిపల్లి ,20న ముదిమడుగుపల్లిలో వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. మార్చి 5న కదిరాయ చెరువు, 12న బాటవారిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలని ఆయన కోరారు.

ప్రజా ప్రభుత్వం రావాలి :'యల్లటూరు'

ప్రజాశక్తి-నందలూరు

సైకో పాలన పోవాలి ప్రజా ప్రభుత్వం రావాలని జనసేన నేతలు యల్లటూరు శ్రీనివాసరాజు, మల్లిసెట్టి తిరుమల రావు(బాబీ)లు పేర్కొన్నారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లిలో ర్యాలీగా నిర్వహించి నూతనం ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి పాలన తుగ్లక్ పాలనను తలపిస్తోందని త్వరలోనే ప్రజా ప్రభుత్వం వస్తుందని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో విజయ దుందుభి మోగించడం ఖాయమన్నారు. అనంతరం 200 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మాజీ జెడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివ ప్రసాద్, కుప్పాలజ్యోతి, కత్తి నరసింహులు, శరత్‌బాబు, మాజీ ఎంపిటిసి చల్లనాగేంద్ర, ఆకులచలపతి, వాసు, తోట శివశంకర్, వెంకటయ్య పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

ప్రజాశక్తి-గాలివీడు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఇఒ-2 వల్లెపు శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం టీచర్స్ కాంప్లెక్స్ సమావేశాన్ని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ప్రార్థన సమయాన్ని 20 నిమిషాల్లో ముగించాలని తరగతులు 45 నిమిషాలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజన విరామం 20 నిమిషాలు ఇవ్వాలని ప్రతి ఒక్కరూ బేస్ లైన్ టెస్ట్‌ను నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మెనూ ప్రకారము మిడ్ డే మీల్స్ అన్‌లైన్ రిజిస్ట్రేషన్ అన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలో ఒకరు సెలవు తీసుకుంటే మరొకరు హాజరు కావాలని, ఇద్దరూ సెలవులు పెట్టే సందర్భంలో ఎంఇఓకి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ నూలువీడు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వర్‌రాజు, ఉపాధ్యాయులు రాజేశ్వరి, హేమలత, ఉపేంద్ర, సి.వి.రమణ, నాగరాజు, జయన్న పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ చక్రధర్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి హిందీ ఉపాధ్యాయులకు పలు సూచనలు , సలహాలు చేశారు. మార్చిలో జరగబోవు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు హిందీ లో నూరు ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. సి.ఓ గ్రేడ్ విద్యార్థుల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉత్తీర్ణత సాధించడానికి సులభమైన టిప్స్‌ను సి.ఓ గ్రేడ్ విద్యార్థులకు తెలియ పరచాలన్నారు.విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని చెప్పారు. బోధనా అనంతరం ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థి దగ్గరకి వెళ్లి అర్థమయ్యే విధంగా బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ ఆర్‌పిలు, సయ్యద్ సర్దార్ హుస్సేన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో వివిధ రాజకీయపార్టీల నాయకుల నుండి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ గిరీష పిఎస్, అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, మిస్సింగ్ జాబితా, ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పెండింగ్ ఉన్న రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గిరీష, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాజంపేట, మదనపల్లె ఆర్‌డిఒలు రామకృష్ణారెడ్డి, మురళి, ఎన్నికల విభాగం అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించి వచ్చిన ఫామ్స్ 6,7,8 పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలన్నారు. జంక్ క్యారెక్టర్లు, డబుల్ ఎంట్రీ, ఒకే డోర్ నెంబరు పై 10 కంటే ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని చెప్పారు. ఎవరైనా ఎక్కువగా దరఖాస్తులు సమర్పించినట్టయితే అందుకు తగిన ఆధారాలు ఉండేటట్లు చూడాలన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు.

హార్సిలీహిల్స్‌లో లోపించిన పారిశుద్ధ్యం

- ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు
- కన్నెత్తి చూడని పర్యాటక శాఖ సిబ్బంది
- అసహనం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు



కొండపై పడివున్న ప్లాస్టిక్ వ్యర్థాలు



గాలిబండపై మద్యం బాటిళ్లు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఆంధ్ర ఊటీగా ప్రసిద్ధిగాంచిన అన్నమయ్య జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ కు ఒకప్పుడు సామాన్యుల సైతం ఆహ్లాదం కొరకు వెళ్లి వచ్చేవారు.ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా కేవలం ధనవంతులు మాత్రమే ప్రస్తుతం హార్సిలీహిల్స్ అందాలను ఆస్వాదిస్తున్నారనడం అతిశయోక్తి లేదు. ముఖ్యంగా కొండపై వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. టోల్ ఛార్జీల పేరుతో పర్యాట కులపై ఆర్థిక భారం మోపుతున్నారు. హార్సిలీహిల్స్‌కు వెళ్లాలంటే సామాన్య పర్యాట కులు బెంబేలెత్తి పోతున్నారు. కొండపై పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయింది. శుక్రవారం గాలిబండ పరిసర ప్రాంతాల్లో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవించి, బాటిళ్లను పగలగొట్టిన గాజు సిసాలను అక్కడే వదిలి వెళ్ళిపోతుండటంతో ఆ ప్రాంతమంతా గాజు పెంకులతో నిండిపోయింది. పరిశుభ్రతపై ఏ అధికారి వచ్చిన మాటల్లోనే కానీ చేతల్లో చూపించడం లేదని స్థానికులు, పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పర్యాటక రంగంలో ఆదాయానికి కామధేనువు వంటి హార్సిలీహిల్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రత ప్రాధాన్యతనివ్వాలని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ఆదాయంపైనే కాకుండా పర్యాటకులకు సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి పాలన సాగుతోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బడికాయలపల్లి పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం ఆయన పాల్గొన్నారు. చెరువుముందరపల్లె, ఓబిశెట్టిపల్లె, కమటంపల్లె, జింక దాట్లపల్లె, చెదబావిపల్లి, వలసగుట్టపల్లె, సేతురావుపల్లె, గురికానిపల్లె, దబ్బలవారిపల్లె, గుట్టూరు, బడిగెద్దులపల్లె, యాలగిరిపల్లె, చింతమాకులపల్లె, నామాలపల్లె, సూరపువారిపల్లె, కొత్తూడియం, దయ్యాలపల్లెలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలతో పేద, మధ్య తరగతి ప్రజల గృహాల్లో వెలుగులు నింపిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ తెలుగుదేశం పార్టీ నాయకులు బూటకపు హామీలతో మభ్య పెడతారని ప్రజలంతా అప్రమత్తంగా ఉండి సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, వైస్ ఎంపిపి రాధ, జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్‌అహ్మద్, సర్పంచ్ ఆదెప్ప గౌడ్, ఎంపిటిసి సుబ్బయ్య నాయుడు, రెడ్డీశ్వర్‌రెడ్డి, రమేష్ నాయుడు, సద్దాం, ఎస్ఎస్ ఫయాజ్, సబ్జీ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తాం'



నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రజావ్యతిరేక భూ హక్కుల చట్టాన్ని రద్దు చేస్తామని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ పార్టీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. భూ హక్కుల చట్టానికి వ్యతిరేకంగా భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) కడప, అన్నమయ్య జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం పక్కన అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి .ఈశ్వర్ అధ్యక్షత వహించారు. తెలుగుదేశం, కాంగ్రెస్, జనసేన, సిపిఐ రైతు సంఘం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భారతీయ అంబేద్కర్ సేన, న్యాయవాదులు కక్షిదారులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ జగన్ పాలన అరాచకంగా కొనసాగిందని చెప్పారు. జగన చేస్తున్న ప్రతి పనీ ప్రజా వ్యతిరేకమైందని పేర్కొన్నారు. ప్రజలకు ఏ వ్యవస్థ అన్యాయం చేసినా న్యాయ వ్యవస్థను ఆశ్రయించి న్యాయాన్ని పొందుతారని, అలాంటి న్యాయ వ్యవస్థను పక్కన పెట్టే భూ హక్కుల చట్టాని జగన్ తీసుకురావడం దుర్మార్గమైందని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులకు ప్రజల ఆస్తులు, హక్కులు నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వం ఇచ్చిందంటే చిన్న, సన్నకారు రైతులు మధ్యతరగతి ప్రజలు రోడ్డున పడాల్సి వస్తుందని చెప్పారు. ఈ చట్టం ఎంత మాత్రమూ ఆమోద యోగ్యం కాదని, రాజ్యాంగానికి విరుద్ధమైన చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావడం అన్యాయమని మండిపడ్డారు. ఈ దుర్మార్గమైన చట్టాన్ని మొదట న్యాయవాదులు గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా వారి విధులను బహిష్కరించి ప్రజల కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. భూ హక్కుల చట్టం రద్దు కోసం భవిష్యత్తులో జరగబోయే ఏ పోరాటానికైనా తమ వంతు మద్దతు ఉంటుందని వారు ఉమ్మడిగా ప్రకటించారు. అంతకు ముందు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి నేతాజీ క్లబ్ వరకు ప్లకార్డులు ధరించి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి, డిసిసి అధ్యక్షులు అల్లాబకాష్, సిపిఐ శ్రీనివాసులు విశ్వనాథనాయక్, రైతు సంఘం రంగారెడ్డి, రజక సంఘం శ్రీనివాసులు, రమేష్, ప్రజాసంఘాల కార్యదర్శి రామాంజనేయులు, పెమ్మాడపల్లి సర్పంచ్ వాసు, బిసి సంఘం న్యాయవాది నాగముని, విద్యావంతుల వేదిక నాయకులు జయరాం, మారుతి శంకర్, బాస్ రాష్ట్రకార్యదర్శి తాతయ్య, టిడిపి నాయకులు భానుప్రకాశ్ రాజు, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు ఎం.విశ్వనాథ్, న్యాయవాదులు రాజ్‌కుమార్ రాజు, చిన్నయ్య, ఖాదర్‌బాష, హుమయున్‌బాషా, టి.వి రమణ, కె.వి రమణ, బి.విరమణ, రవిశంకర్, నిరంజన్, సీనియర్ మహిళా న్యాయవాది రాజకుమారి చంద్రిక, కుసుమ, వరలక్ష్మి,శివమ్మ, రాజకుమార్ ఖిజరాలి, ప్రజాసంఘాల నాయకులు , ప్రజలు, కక్షిదారులు పాల్గొన్నారు.



చంద్రబాబుతో మాట్లాడుతున్న గంటా నరహరి, జయచంద్రారెడ్డి

చంద్రబాబును కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని ప్రముఖ పారిశ్రామిక వేత్త, దాసరపల్లి జయచంద్రారెడ్డి శుక్రవారం టిడిపి జాతీయ అధ్య క్షుడు చంద్రబాబు నాయుడుని కలిశారు. కుప్పం పర్యటనలో భాగంగా వచ్చిన చంద్రబాబును జయచంద్ర రెడ్డి, సతీమణి కల్పనారెడ్డితో మర్యాదపూర్వకంగా కలిసి చంద్రబాబుకు పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు జయచంద్రారెడ్డితో రెండు నిమిషాల్లో పాటు నియోజకవర్గ పరిస్థితులు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో పారిశ్రామికవేత్త మంత్రి గిరిధర్ రెడ్డి, మార్కిరి ఆంజనేయ రెడ్డి, మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి, శివారెడ్డి, హారిష్, అరుణ్ కుమార్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కొండ్రెడ్డి అశోక్‌లు ఉన్నారు. **రాజంపేట అర్బన్ :** టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును టిడిపి నేత గంటా నరహరి కుప్పం నియో జకవర్గంలో మర్యాద పూర్వ కంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి ఆయనను శాలువాతో సత్కరించారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మృతి చెందిన బాధితుడి భార్యకు వైఎస్ఆర్ బీమా ద్వారా తక్షణ సహాయం కింద రూ.10 వేలను సచివాలయ సిబ్బంది, కమిషనర్ పి.ఆర్ మనోహర్ చేతులమీదుగా అందజేశారు. నగర పంచాయతీ, సచివాలయం-2 పరిధిలోని దర్గావీధిలో నివాసమున్న మహబూబ్‌బాషా అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, ఆదేశాల మేరకు సచివాలయం వెల్ఫేర్, స్థానిక వాలంటీర్ మృతుడి ఇంటికి వెళ్లి మృతుడి భార్యకు నగదును అందించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ జీవి.రామకృష్ణ ,జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

పుల్లంపేట :మండల కేంద్రంలోని చిట్వేలి రోడ్డులో ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇళ్లను శుక్రవారం మండల తాహశీల్దార్ నరసింహకుమార్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా తాహశీల్దార్ మాట్లాడుతూ వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కడప-చెన్నై జాతీయ రహదారి నుంచి చిట్వేలి వెళ్లడానికి అనువుగా రోడ్డు వెడల్పు మరమ్మత్తులలో కారణంగానే రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ఎవరైనా అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. స్థానిక ఎస్ఐ రఘురాం ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, సోము శేఖర్ రెడ్డి, నవీన్, శీను, రవి పాల్గొన్నారు.

4న నూతన పింఛన్‌లు పంపిణీ

కలకడ :పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు పింఛన్‌లు మంజూరైనట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి అధ్య క్షతన, ఎంపిపి శ్రీదేవి రవికుమార్ ఆధ్వర్యంలో మండలంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన నూతన పింఛన్లను జనవరి 4న ఉదయం పది గంటల సమయంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం లో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్య క్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, కోఆప్షన్ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, అధికారులు, హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ముళ్ల పొదలు తొలగింపు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని గుట్టపాలెం పంచాయతీ దిగవకం భంవారిపల్లెలో ఇటీవల ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గడపగడపకు కార్యక్రమంలో పర్యటించిన సందర్భంలో ప్రజలు రోడ్డు కిరువైపులా కంపలు పెరిగిపోవడం, ఎక్కువ మలుపులు ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ముళ్ళ కంపుల తొలగించి ప్రమాదాలు అరికట్టే విధంగా చూడాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాలు మేరకు అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ద్వారకనాథ్‌రెడ్డి జెసిబి సహాయంతో రోడ్డు ఇరువైపులా ముళ్ళ పొదలను తొలగించి అటు నాయకులు, ప్రజల నుంచి అభినందనలు పొందారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమల ప్రధాన రహదారి నుంచి దిగువకమ్మవారిపల్లె వరకు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి రాకపోకలకు ప్రమాదకరంగా మారిందని అన్నారు. కమ్మోళ్ల చెరువు కట్టపైన ముళ్లపొదలు పెరిగి నాలుగు గ్రామాల రైతులు తన వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే సూచనల మేరకు జెసిబి ముళ్లపొదలను తొలగింపజేసినట్లు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు బాలల హక్కుల గురించి వివరించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలమని తెలిపారు. ఆ పాఠశాల నుంచి గతంలో ఆటల పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి-గాలివీడు

తమను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ మండలంలో ట్రాన్స్‌కో పరిధిలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఎనర్జీ సహాయకులు టాన్స్‌కో ఎడి విజయ భాస్కర్‌రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను పత్రంలో సచివాలయ ఉద్యోగులుగా లేదా ట్రాన్స్‌కో కార్యాలయ సిబ్బందిగా అయిన గుర్తించాలని కోరారు. ఎటు గుర్తింపు లేకుండా గోడమీదపిల్లిలా ఉద్యోగం చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణానికి ప్రమాదకరమైన పని చేస్తున్నప్పటికీ మా కుటుంబాలకు రక్షణ లేకుండా పోయే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. తమకు భద్రత కల్పించాలని డిమాండ చేశారు. కార్యక్రమంలో తిరుమల , రామకృష్ణ, సుదర్శన్ నాయక్, వంశీ నాయక్, రామేశ్వర్‌రెడ్డి, విశ్వనాథ్, మహమ్మద్, రియాజ్, గంగాధర్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్ర క్రీడలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం ఈ క్రీడలను నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు, విద్యార్థులు తమ క్రీడా సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు ఇది చక్కని వేదికని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శరీరానికి ఆరోగ్యంతో పాఉ మానసిన ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. వివిధ స్థాయిలలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఆర్ఐ.శ్రీనివాసులు, వైసిపి నాయకులు జి.వి.రామకృష్ణ, కల్యాణ్ కుమార్‌రెడ్డి,చాంద్‌బాషా పాల్గొన్నారు.



పూలమాలతో రమేష్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

ఆదరించండి..అభివృద్ధి చేస్తా : ఆర్ఆర్

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని చీమలచెరువు పంచాయతీలో శుక్రవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలతో మమేకమవుతూ టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇప్పటికే నాలుగు దఫాలుగా పోటీ చేసి ఓటమిపాలైనప్పటికీ ప్రజాసమస్యల పరిష్కారంలో రాజీ పడలేదని అన్నారు. ఈ సారైనా గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి ఏంటో చేసి చూపి స్తానని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొట్టి నారాయణరెడ్డి, పొట్లి వెంకట్రాంరెడ్డి, మందపాటి రవీంద్రబాబు,కేడెంలక్ష్మయ్య, బికె.మహమ్మద్, రియాజ్ కొల్లూరి, రామానుజులు, సూర్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వీరబల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నేతి ఆంజనేయులు, ఎంపిడిఒ మల్లీశ్వరిలు పేర్కొన్నారు. మండలంలోని సానిపాయి, ఓదివీడు పంచాయతీలో వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం అందిస్తున్న అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలిపేందుకు వికసిప్ భారత్ సంకల్పయాత్ర ఏర్పాటు చేశారని అన్నారు. సంక్షేమ పథకాలు అందని వారు తమ దృష్టికి తీసుకవస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. డాక్టర్ సయ్యద్ జియావుల్లా మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద గ్రామాల్లో ప్రత్యేక వైద్యం పట్ల చర్యలు తీసుకొని అందరికీ సేవలు అందేలా చూస్తున్నట్లు చెప్పారు. అనంతరం వైష్ణవి స్కూల్, జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, ఓడివీడు సర్పంచ్ తన యుడు శివ, ఎపిఒ నాగరాజ్, ఎటిఎం ఖాదరవల్లి, హౌసింగ్ ఎఇ వెంకటేష్ పాల్గొన్నారు.



సంగం డెయిరీ ప్రారంభోత్సవంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి

సంగం డెయిరీ ప్రారంభం

ప్రజాశక్తి-రైల్వే కోడూరు

స్థానిక పట్టణంలో ఆర్ఎస్ రోడ్డులో కునసం మోహన్ నూతన సంగం డెయిరీని ముక్కా రుపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు తనయుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోహన్ పెంచలయ్య, శ్రీకాంత్, వెంకట్‌రాయల్ , రవితేజ, శంకరయ్య, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, సాలవ రమణరాజు, ప్రవీణ్, మధు, షేక్‌గౌస్, వెంకటేష్ చిరంజీవి, శివాజీ, కిరణ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

అంతర్ జిల్లా చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

- 11 బంగారు గొలుసులు రికవరీ
- మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-కలకడ

అంతర్ జిల్లా చైన్ స్నాచింగ్ ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు రాయచోటి డిఎస్‌పి సయ్యద్ మహబూబ్‌బాషా, సిఐ నాగేంద్ర ఆధ్వర్యంలో అంతర్ జిల్లా చైన్ స్నాచింగ్ కు పాల్పడిన ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారంమేరకు వివరాలిఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సిటీ ఉల్లా రూపనగరా వుల్లారుకు చెందిన సయ్యద్ నూర్‌బాషా కుమారుడు సయ్యద్ ఇర్ఫాన్‌బాషా బెంగళూరు నుంచి కలికిరికి వచ్చి పెయింటింగ్ పనులు చేసుకుంటూ భార్య పిల్లలతో నివాసం ఉండేవాడని తెలిపారు. అతనికి సంపాదన తక్కువ కావడంతో చోరీలు చేయాలన్న సంకల్పంతో కలికిరికి చెందిన ఎస్.మహమ్మద్ రఫీ కుమారుడు ఎస్ మహమ్మద్ అలీ, మహబూబ్ అలీ కుమారుడు మహబూబ్‌బాషా బెంగళూరుకు చెందిన సిరాజ్‌బాషా కుమారుడు హర్షద్ బాషా, అక్రమ్‌బాషా కుమారుడు అర్బాష్‌బాషాలను స్నేహితులకు చేసుకొని దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. సయ్యద్ ఇర్ఫాన్‌బాషా మిగిలిన నలుగురితో కలిసి మూడు ద్విచక్ర వాహనాలలో ఈనెల 7వ తేదీ నుంచి ఇప్పటివరకు 11 నేరాలలో పాల్గొని రూ.11.74లక్షలు విలువ చేసే 268 గ్రాముల 11 బంగారు గొలుసులను దొంగలించినట్లు తెలిపారు. శుక్రవారం వారిని అదుపులోకి తీసుకొని 11 బంగారు గొలుసులను, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు డిఎస్‌పి సయ్యద్ మహబూబ్ బాషా తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి శ్రమించిన ఎస్ఐ తిప్పేస్వామి, ఎఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్స్ హరిబాబు, రమేష్ కుమార్, నాగరాజా, పోలీస్ సిబ్బంది తాతయ్య, రమేష్, మహబూబ్‌బాషా, రామ్మోహన, కరుణాకర, ప్రతాప్, రమణ, లక్ష్మీనారాయణ, అల్లి, హోంగార్డు గురవయ్య, డ్రైవర్ రమేష్‌బాబు లను ప్రశంసించి నగదును బహుమతిగా ఇచ్చినట్లు తెలిపారు. ఎస్‌పి చేత ప్రశంసా పత్రాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఔ

అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కలికిరి

అనారోగ్యంతో ఓ వృద్ధుడు ఆత్మహత్య యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. కలికిరి మండలం, మునోళ్ళపల్లి పంచాయతీ, మూరెవాండ్లపల్లికు చెందిన జె .సిద్దయ్య(72), అనారోగ్యంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 23వ తేదీ పొలం వద్ద పురుగుల మందు తాగి, వాంతులు చేసుకొంటూ వుండగా గమనించిన అతని మనవడు చంద్రబాబు కుటుంబ సభ్యులకు తెలిపి, వెంటనే అతనిని కలికిరి ప్రభుత్వ ఆస్పత్రికి చేర్పించినట్లు తెలిపారు. అక్కడి నుంచి తిరుపతి రుయా ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తము తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐఎస్.కే.రహీముల్లా తెలిపారు.